క్లుప్తంగా

అంగన్‌వాడీలకు అవగాహన

రేపల్లె రూరల్: పట్టణంలోని 3వ వార్డు ఎంపీహెచ్‌ఆర్‌ఎస్, ఇసుకపల్లిలోని ట్రిబుల్ ఎస్ పాఠశాలల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం గురువారం కొనసాగింది. స్థూల, సూక్ష్మ కండరాల వికాసాభివృద్ధిపై అవగాహన కల్పించారు. ఎఫ్‌ఎల్‌ఎన్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ సుభాని మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో నేర్చుకునే ప్రతి అంశాన్ని చిన్నారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో ఎం.సుచిత్ర, ఉపాధ్యాయులు టి.సురేష్, ప్రభాకర్, సూపర్‌వైజర్ శివజ్యోతి పాల్గొన్నారు.

ఎవురుల దుకాణాలపై 6ఏ కేసు నమోదు

చెరుకుపల్లి: మండల కేంద్రంలోని రెండు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో బుధవారం సాయంత్రం నుంచి అర్ధరాత్రి 1.30 గంటల వరకు విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.మహేష్‌బాబు గురువారం తెలిపారు. భువనశ్రీ ఫర్టిలైజర్స్, గుప్తా ట్రేడర్స్‌పై దాడులు నిర్వహించి, రెండు దుకాణాల్లోనూ స్టాకు వ్యత్యాసం గుర్తించామని చెప్పారు. కాల పరిమితి దాటిపోయిన పురుగు మందులను సీజ్ చేసి, అనుమతులు లేని పలు బయో కంపెనీల పురుగు మందుల అమ్మకాలను కూడా నిలుపుదల చేశామని చెప్పారు. రెండు దుకాణాల యజమానులపై 6ఏ కేసు నమోదు చేశామని చెప్పారు. రెండు షాపులలో రూ.15.68 లక్షల స్టాకు వ్యత్యాసం, రూ.3.36 లక్షల అనుమతులు లేని బయో పురుగు మందులు, రూ.1.13 లక్షల విలువైన కాల పరిమితి దాటిన పురుగు మందులను గుర్తించామని చెప్పారు.

కోడ్ ఉల్లంఘన



వేమూరు: పంచాయతీ అధికారులు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. స్థానిక పంచాయతీలో తెలుగు దేశం పార్టీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించలేదు. ఈ నెల 27వ తేదీన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. అప్పటి వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. కానీ, నిబంధనలను అధికారులు పాటిస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు.

పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ



ఖాజీపాలెం(కర్లపాలెం): పోరాట పటిమ కలిగిన మరాట యోధుడు ఛత్రపతి శివాజీ అని క్షత్రియ యూత్ నాయకుడు ధనుంజయ్‌రాజు అన్నారు. ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఖాజీపాలెంలో గురువారం ఛత్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయ్‌రాజు మాట్లాడుతూ మొగల్ సామ్రాజ్యాన్ని ఎదిరించి పోరాడిన యోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో వెంకటేశ్వరరాజు, యశ్వంత్, మురళి, రాజ్‌కుమార్, చరణ్ తదితరులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి



కర్లపాలెం: గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు చెప్పారు. సమ్మెటవారిపాలెం గ్రామంలో గురువారం జరిగిన 104 వైద్య శిబిరాన్ని ఎంపీడీవో శ్రీనివాసరావు సందర్శించి, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు, వృద్ధాప్యంలో ఉన్న వారికి వైద్య సేవలందించేందుకు గ్రామాల్లో 104 వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని చెప్పారు. వైద్య సిబ్బంది శిబిరానికి వచ్చే రోగుల పట్ల దయ కలిగి వారికి కావలసిన వైద్య పరీక్షలు చేసి మందులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: సోదరి చనిపోయిందని మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన వడ్డి రవితేజ(32) రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు భార్య, పది నెలల కుమారుడు ఉన్నారు. 2020లో కరోనాతో రవితేజ సోదరి పావని మృతిచెందింది. ఈ నెల 17న హైదరాబాద్ వెళుతున్నానని చెప్పి గుంటూరు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అశ్విని లాడ్జిలో పురుగు మందు తాగాడు.

భవనం నిరుపయోగం

- శిథిలావస్థలో మూతపడిన సంక్షేమ వసతి గృహాలు
- ఆగిన ఆర్బీకే, వెల్‌నెస్, సచివాలయ భవనాలు
- నిర్మాణాలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం



నిరుపయోగంగా బీసీ వెల్ఫేర్ బాలుర వసతి గృహం

చెరుకుపల్లి: కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్మాణాలు పూర్తి కాక మరికొన్ని దీన స్థితిలో ఉన్నాయి. విద్యార్థుల చేరిక లేక మూత పడిన సంక్షేమ వసతి గృహాలు కూలేందుకు సిద్ధంగ ఉన్నాయి.

శిథిలావస్థలో సంక్షేమ వసతి గృహాలు

మండలంలోని కావూరు గ్రామ పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి పక్కనే సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ఉంది. ఇందులో 12 గదులున్నాయి. వసతి గృహం మూసివేయడంతో ఆక్రమణలకు గురైంది. భవనం నిరుపయోగం కావడంతో శిథిలావస్థకు చేరింది. అలాగే గ్రామంలోనే బీసీ వెల్ఫేర్ వసతి గృహం కోసం 2009లో గ్రామానికి తుమ్మల వీరయ్య, రాజమ్మల జ్ఞాపకార్థం కుమారుడు రేపల్లె మార్కెటింగ్ యార్డు మాజీ చైర్మన్ నరేంద్రనాథ్ 26 సెంట్ల స్థలం వితరణ చేశారు. అందులో రూ.87 లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. ఇప్పుడు ఆ భవనంలో రైతు సేవా కేంద్రం ఒక గదిలో నడుస్తోంది. మిగిలిన తొమ్మిది గదులు నిరుపయోగంగా మారాయి.



పొన్నపల్లిలో చివరి దశలో నిర్మాణ పనులు ఆగిన ఆర్బీకే భవనం



శిథిలావస్థలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం

కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయ భవనాలను నిర్మించారు. కొన్ని గ్రామాల్లో ఈ భవనాల నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని పట్టించుకోకపోవడంతో.. ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. ఇప్పటికైన అధికారులు స్పందించి ప్రభుత్వ భవనాలు నిరుపయోగం కాకుండా.. వాటిని పూర్తి చేసి, వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

విద్యార్థులు చేరకపోవడంతో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు మూతపడ్డాయి. బీసీ వెల్ఫేర్ వసతి గృహాన్ని బాపట్ల జిల్లా ఏర్పడకముందే గుంటూరు వ్యవసాయ శాఖాధికారులు రైతు భరోసా కేంద్రంగా వినియోగించుకుంటామని అనుమతి పొందారు. మరో మారు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– ఆర్, దిబోరా, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి, బాపట్ల

నిర్మాణాల్లో సచివాలయ భవనాలు



మండలంలో 17 సచివాలయాలకు ఆరు భవనాలు పూర్తయ్యాయి. 11 నిర్మాణ దశల్లో ఉన్నాయి. రైతు ఆర్బీకేలు 15కు గాను నాలుగు పూర్తయ్యాయి. 11 వివిధ దశల్లో ఉన్నాయి. వెల్‌నెస్ సెంటర్ల పరిస్థితి కూడా ఇలానే ఉంది. 11 భవనాలకు గాను 7 పూర్తయ్యాయి.. 4 భవనాలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

– ఇ.నాయక్, పీఆర్ ఏఈఈ, చెరుకుపల్లి

అరవపల్లి మార్గంలో పారిశుద్ధ్య చర్యలు



రోడ్డు పక్కన చెత్త నిల్వలను తొలగిస్తున్న సిబ్బంది

రేపల్లె రూరల్: రేపల్లె నుంచి అరవపల్లి వెళ్లే రోడ్డును గురువారం స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రపరిచారు. మహా శివరాత్రి సందర్భంగా అరవపల్లి వెళ్లేందుకు ఇదొక్కటే మార్గం కావడంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. రహదారికి ఇరువైపులా చెత్తను పడేయొద్దని, పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యతని చెప్పారు. తిరునాళ్ల నాటికి ఎన్నికల కోడ్ కొనసాగుతుందని, రహదారికి పక్కన భక్తులు ఏర్పాటు చేసుకునే ఫ్లెక్సీల్లో రాజకీయ నాయకుల బొమ్మలు లేకుండా చూసుకోవాలన్నారు. రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం, పిచ్చి చెట్లను తొలగించారు. ప్లొక్లయిన్‌తో గుంతలను సరి చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి చెందేలా బోధన ఉండాలి



కార్యకర్తలకు వివరిస్తున్న శిక్షకులు

కొల్లూరు: చిన్నారులు సమగ్రంగా అభివృద్ధి చెందేలా అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన పద్ధతులను పాటించాలని శిక్షకులు, రిసోర్స్ పర్సన్స్ సీహెచ్.సుధాకర్, సీహెచ్.శ్రీనివాసరావు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ మూడొవ రోజు నిర్వహించారు. పలు అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు శారీరక, భాష, మేధ, భావోద్వేగ, సౌందర్య, నైతిక విభాగాల్లో అభివృద్ధి చెందేలా బోధన పద్ధతులు పాటించి, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చిదంబరం, సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోర్టు ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

తెనాలిరూరల్: తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్–2025పై అభిప్రాయాలను ఈ నెల 28వ తేదీలోగా తెలియచేయవలసిందిగా కోరినందున, దేశవ్యాప్తంగా అన్ని స్టేట్ బార్ అసోసియేషన్‌ల పిలుపు మేరకు విధులను బహిష్కరించారు. అడ్వొకేట్ అమెండ్‌మెంట్ యాక్ట్ 2025లోని 4, 9బి, 24ఏ, 24బి. 26ఏ, 35 ఏ, 45 బి 49 ఏ సెక్షన్‌లను సవరించటానికి కేంద్రం ప్రతిపాదన తయారుచేసిందని, ఈ యాక్ట్‌లో న్యాయవాద వృత్తికి ఉన్న స్వేచ్ఛను కాలరాయడమేనని న్యాయవాదులు ఆరోపించారు. ఈ యాక్ట్ అమల్లోకి వస్తే న్యాయవాదులు వారి వృత్తిలో అనేక రకాల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. న్యాయవాదులపై జరుగుతున్న అకృత్యాలను పరిగణనలోకి తీసుకోకుండా, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా పరిగణనలోకి తీసుకోకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న తొందరపాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, సెక్రటరీ హరిదాసు గౌరీశంకర్, బార్ అసోసియేషన్ సభ్యులు తాడిబోయిన శ్రీనివాసరావు, పి.ఆర్.వి.సాగర్, పిల్లి సుధాకర్, చిట్టాల మైకేల్, చింతా సురేశ్ చంద్ర యాదవ్, సోల శంకర్, జన్ను శివరాం, జంపని ఆదినారయణా, నాగళ్ళ హరీష్, అన్నం పిన్నారావు, ఆడక వేంకటేశ్వరావు, అల్లా విజయ కుమారి, పుణ్యవతి, అనిత పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల

నియోజకవర్గ అధ్యక్షుల నియామకం



వేమూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు..పార్టీ అనుబంధ సంఘాల నియోజకవర్గ అధ్యక్షులను నియమించినట్లు సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేమూరు నియోజకవర్గ యూత్ వింగ్ అధ్యక్షుడు గుర్రం మురళీ, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బెల్లం కొండ శివ పార్వతి, రైతు విభాగం గోపాలం రాముప్రసాద్, బీసీ సెల్ కరేటి శివనాగ రాజు, ఎస్సీ సెల్‌కు పోతర్లంక సురేష్, ఎస్టీ సెల్‌కు బాలిక శివన్నారాయణ, మైనార్టీ సెల్‌కు పఠాన్ అలీఖాన్, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు మూల్పూరు మోజేస్, విద్యార్థుల వింగ్‌కు తెనాలి పవన్ కుమార్, పంచాయతీ రాజ్ వింగ్‌కు బొల్లెద్దు ప్రతాప్ కుమార్, అర్‌టీఐ వింగ్‌కు పసుపులేటి శివప్రసాద్, వలంటీర్స్ వింగ్‌కు తలతోటి సందీప్, గ్రీవెన్స్ సెల్‌కు దివి వెంకటేశ్వరావు, వాణిజ్య విభాగానికి బెజవాడ వెంకటశంకరావు, వైఎస్సార్‌టీయూసీ వింగ్‌కు నల్లూకూర్తి నాంచారయ్య, అంగన్‌వాడీ వింగ్‌కు డి.లలితకుమారి, లీగల్ సెల్‌కు వల్లెరి చంద్రసారిన్, సోషల్ మిడియా వింగ్‌కు బాణాల తానీస్ బాబు, ఐటీ వింగ్‌కు అరమళ్ల దినేష్, దివ్యాంగుల విభాగానికి గుంటూరు ప్రవన్, డాక్టర్ వింగ్‌కు కూచిపూడి బాజీబాబు, పబ్లిసిటీ వింగ్‌కు అబ్దుల్లా బేగం, బూత్ కమిటీలు అనవరపు వీరరెడ్డి, వీవర్స్ వింగ్ మాచర్ల రామకృష్ణ, కల్చరల్ వింగ్, మేధావుల ఫోరానికి బి.చిన్న సుబ్బారావు, విశ్వర దత్తును నియమించినట్లు తెలిపారు.

రేపల్లె నియోజకవర్గంలో..

రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రేపల్లె నియోజకవర్గ వివిధ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేసినట్లు వైఎస్సార్ సీపీ రేపల్లె సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యూత్ విభాగం అధ్యక్షుడిగా దొంతుబోయిన కొండలురెడ్డి, మహిళా విభాగానికి వీసం నాగలక్ష్మి, రైతు విభాగానికి కొండెపు శ్రీనివాసరావు, బీసీ సెల్‌కు పాగోలు వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్‌కు బెజవాడ జోసఫ్, ఎస్టీ సెల్‌కు ఊసరపు సత్యనారాయణ, మైనార్టీ సెల్‌కు షేక్ ఖాదర్‌వలీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు బోడ లియం జాన్ హైబెలెస్, విద్యార్థి విభాగానికి మహ్మద్ వాసీం, పంచాయతీ రాజ్ విభాగానికి మత్తి రవికిరణ్, ఆర్టీఐ విభాగంకు సీహెచ్ నాగలక్ష్మి, మున్సిపల్ వింగ్‌కు గొరికపూడి విజయ్‌ఆనంద్, వలంటీరు విభాగానికి తోక వెంకట సతీష్, గ్రీవెన్స్ విభాగానికి కర్రా జాష్ కరుణాకర్, వాణిజ్య విభాగానికి పొన్నూరు పృథ్వీ, వీవర్స్ విభాగానికి కందుల సురేష్‌బాబు, వైఎస్సార్ టీయూసీ విభాగానికి కొలుసు నరేంద్ర, అంగన్‌వాడీల విభాగానికి నిజాంపట్నం అనంతలక్ష్మి, లీగల్ విభాగానికి కర్రా ప్రతాప్, కల్చరల్ విభాగానికి దాసరి చాణిక్య, సోషల్ మీడియా విభాగానికి గురివిందపల్లి అశోక్, ఐటీ విభాగానికి కట్టుపల్లి కిరణ్‌బాబు, దివ్యాంగుల విభాగానికి టి.బాలకృష్ణ, వైద్యుల విభాగానికి షేక్ అతిక్, పబ్లిసిటీ విభాగానికి శొంఠి సురేష్, బోత్ కమిటీస్ విభాగానికి గాలిమోతు రాజశేఖర్, ఇంటెలెక్చువల్ విభాగంగా ఉల్లంగుట శ్రీరామమూర్తి ఎంపికయ్యారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడి మృతి

పెదకాకాని: గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడు మృతి చెందిన ఘటన పెదకాకాని మండలం తక్కెళ్లపాడు జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. పెదకాకాని సీఐ నారాయణస్వామి తెలిపిన వివరాలు.. చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన ఆదిమూలపు చైతన్య తక్కెళ్లపాడు వద్ద గుంటూరు నగరానికి తాగునీరు అందించే పంపు హౌస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. వివాహితుడైన చైతన్య నులకపేటలో నివసిస్తున్నాడు. అతడికి భార్య, ఇరువురు పిల్లలు ఉన్నారు. విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై నులకపేటకు వెళ్తుండగా తక్కెళపాడు జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తలకు బలమైన గాయాలవటంతో అక్కడక్కడే ద్విచక్ర వాహనంపై పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుని సోదరుడు జీవన్‌బాబు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీహెచ్‌సీని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ టీం



పొన్నూరు: నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రపంచ బ్యాంక్ బృందం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వరల్డ్ బ్యాంక్ టీం గణేష్, మొహీర్ అహ్మదేవ్ వైద్యశాలలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యశాలకు కావలసిన పరికరాలు, వసతులు, రోగ్య కేంద్రం అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను సీహెచ్‌సీ సూపరింటిండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్‌ను అడిగి తెలుసుకున్నారు.

మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికుల నిరసన

గుంటూరు రూరల్: మండలంలోని దాసరిపాలెంలో నూతనంగా వైన్‌షాపును ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు గురువారం వైన్ షాపు వద్దంటూ నిరసన తెలిపారు. తమ గ్రామంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయరాదని, చేస్తే ధర్నాలు చేస్తామని గ్రామంలోని ప్రజలు ఆందోళన చేశారు. విషయం తెలిసిన నల్లపాడు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని స్థానిక ప్రజలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని ప్రజలు నివసించే ప్రదేశాల్లో వైన్ షాపు ఏవిధంగా ఏర్పాటు చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. వైన్‌షాపును ఏర్పాటు చేస్తే ధ్వంసం చేస్తామని స్థానిక ప్రజలు తెలిపారు. దీంతో పోలీసులు స్థానిక ప్రజలకు నచ్చజెప్పి పంపించారు.

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థినికి ఉపాధి లక్ష్యంగా తమ కళాశాలలో నాణ్యమైన విద్యనందిస్తున్నట్లు సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య తెలిపారు. గురువారం గోరంట్లలోని కళాశాలలో టెక్ బీఎం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థినులను సంస్థ హెచ్‌ఆర్ టి.వాసవి, సుష్మ, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి అభినందించారు.

ఉపాధి పనులు త్వరితగతిన పూర్తి చేయండి



పెదకాకాని: ఉపాధి హామీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ కోరారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై సమీక్షా సమావేశం గురువారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు జరుగుతున్న తీరును తెలుసుకున్నారు.

దాచేపల్లి ర్యాలీపై దాడి దుర్మార్గం

గుంటూరు రూరల్: పల్నాడు జిల్లా దాచేపల్లిలో బుధవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా జరిగిన ర్యాలీపై దాడిని గుంటూరు జిల్లా సహ సంయోజక్ వంగా నవీన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఇటువంటి చర్యలు మరలా పునరావృతం కాకుండా పోలీస్‌లు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులు లక్ష్య సాధనపై దృష్టి పెట్టాలి



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన ఎండీ మురళీకాంత్

తెనాలిటౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధనతో ముందుకు వెళ్లాలని నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ పేర్కొన్నారు. స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ జూనియర్ కళాశాలలో గురువారం ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పాల్గొని మాట్లాడారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ తరువాత ఉండే వివిధ కోర్సులపై అవగాహన కల్పిస్తూ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు లక్ష్య సాధనతో ముందడుగు వేయాలని సూచించారు. గీతాకాంత్ మాట్లాడుతూ కృషి, పట్టుదల, అంకిత భావంతో కష్టపడి చదివితే గ్రామీణ విద్యార్థులు సైతం అద్భుత విజయాలు సాధించవచ్చని స్పష్టం చేశారు. ఈ విద్యాసంవత్సరం పలు క్రీడా, విద్యసంబంధ పోటీల్లో విజేతలు అయిన వారికి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శేషగిరిరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.నాగశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకట పవన్‌కుమార్‌కు అభినందనలు

స్మార్ట్‌ఫోన్, నూతన వస్త్రాలు బహూకరించిన 'మానవత'



పవన్‌కు స్మార్ట్‌ఫోన్, నూతన వస్త్రాలు అందజేసిన మానవత సంస్థ బాధ్యులు

తెనాలి: నిరుపేద కుటుంబంలో జన్మించి, రోజూ కాలినడకన కాలేజీకి వెళ్లి వస్తూ ఇంటర్మీడియట్ చదువుతున్న వివేక జూనియర్ కాలేజీ విద్యార్థి తూనుగుంట్ల వెంకట పవన్‌కుమార్‌కు తొలి ప్రయత్నంలోనే జాతీయస్థాయి జేఈఈ మెయిన్స్‌లో 99.37 పర్సెంటైల్ సాధించటంపై మానవత స్వచ్ఛంద సంస్థ హర్షం వ్యక్తంచేసింది. ఆ పేదింటి ప్రతిభావంతుడి పైచదువులకు అవసరమైన స్మార్ట్ ఫోన్‌తోపాటు నూతన వస్త్రాలు, బూట్లు అందజేశారు. గురువారం సాయంత్రం ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో మానవత, తెనాలి చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, సంస్థ అధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, వివేక జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ కొడాలి బ్రహ్మం, వివేక డీన్ నన్నపనేని సునీల్, సంస్థ కార్యదర్శి పి.వెంకట్, పి.వాసు డీవీ సోమయ్యశాస్త్రి, ఎస్వీ శర్మ, చదలవాడ సాంబశివరావు, ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖర్‌రెడ్డి, రోహిని మురళీ, మల్లేశ్వరి పాల్గొన్నారు.